

కేటగిరీ ప్రమోషన్లకు బ్రేక్!
సింగరేణిలో ఏటా మార్చిలో ఇచ్చే కేటగిరీ ప్రమోషన్లను నిలిపివేయారు. దీంతో ప్రమోషన్లు పొందే కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 8లో



మహంకాళి జాతరకు వేళాయె
ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి అమ్మవారి ఆలయం జాతరకు సిద్ధమవుతోంది. ఈ నెల 23 నుంచి జాతర సాగనుంది. 9లో

గరిష్టం/కనిష్టం
38.8 /27.8

వాతావరణం
ఆకాశం కొంతమేర మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఘనంగా మహావీర్ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న సమాజ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో మహావీర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహావీరుడి చిత్రపటంతో పురవీధుల్లో ర్యాలీ చేపట్టారు. మార్వాడీ సమాజ్ అధ్యక్షుడు అజిత్ లోఢా మాట్లాడుతూ మహావీరుడి తత్వాలు, సిద్ధాంతాలు, శాంతి సందేశాలు జీవితంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అజయ్‌కుమార్ లోఢా, పారస్ టాటియా, నవీన్ లోఢా, వైభవ్ టాటియా, మూల్‌చంద్ లోఢా, దర్శన్ లోఢా, మహిళలు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రోడ్లపై తిరగొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ సదయ్య

ఆసిఫాబాద్‌అర్బన్: అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపై తిరగొద్దని డీఎస్పీ సదయ్య హెచ్చరించారు. జిల్లా కేంద్రంలో శనివారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 75 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ రాత్రిపూట మద్యం మత్తులో వెకిలి చేష్టలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా ఆపరేషన్ చబుత్రా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అర్ధరాత్రి దాటిన తర్వాత మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే తప్ప బయటికి రావొద్దని సూచించారు. అలాగే నంబర్ లేని వాహనాలను నడిపినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండర్ రాకేశ్, సీఐలు సతీశ్, బుచ్చిబాబు, శ్రీనివాస్, ఎస్సైలు రాజేశ్వర్, ప్రవీణ్, సాగర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక చట్టాల పునరుద్ధరణకు పోరాడాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాల పునరుద్ధరణ కోసం కార్మిక వర్గమంతా ఏకమై పోరాడాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగె ఉపేందర్ కోరారు. గోలేటి సీహెచ్‌పీలో ఆదివారం మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, ఎండల తీవ్రత నేపథ్యంలో కార్మికుల పనివేళలు మార్చాలని, సొంతింటి పథకం అమలు చేయాలని, కార్మికుల పిల్లలకు సీబీఎస్‌ఈ సిలబస్ స్కూల్స్ ప్రారంభించాలని, కాంట్రాక్టు కార్మికులకు జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, సతీష్, సంతోష్, కృష్ణ, రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు పనులు పెండింగ్..!

కాగజ్‌నగర్ పట్టణంలోని పెట్రోల్ పంపు ఏరియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన ఊరు– మన బడి పథకం కింద ఎంపికైంది. కాంట్రాక్టర్ అభివృద్ధి పనులు పూర్తి చేశాడు. ఇప్పటివరకు రూ.29లక్షల బిల్లులు రాగా.. మరో రూ.97 లక్షలు రావాల్సి ఉంది. పనులు పూర్తయి ఎనిమిది నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాలేదు. విసిగిపోయిన కాంట్రాక్టర్ ఈ నెల 15న ఉదయం విద్యార్థులు లోపలికి వెళ్లకుండా స్కూల్ గేటుకు తాళం వేశాడు.





ఇది బెజ్జూర్ మండలం కాటేపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాల. మన ఊరు– మన బడి పథకం కింద ఈ పాఠశాల ఎంపికైంది. అదనపు గదుల కోసం పనులు ప్రారంభించారు. అయితే పిల్లర్ల వరకు పనులు చేపట్టారు. ప్రస్తుతం మాత్రం ఎలాంటి పనులు కొనసాగడం లేదు. నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి.

- అసంపూర్తిగా 'మన ఊరు– మన బడి'
- జిల్లాలో 251 పాఠశాలలకు 78 చోట్ల పనులు పూర్తి
- దాదాపు రూ.5 కోట్ల బిల్లులు విడుదల కాని వైనం
- ఇటీవల కాగజ్‌నగర్‌లో స్కూల్‌కు తాళం వేసిన కాంట్రాక్టర్

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా నాణ్యమైన విద్యనందించేందుకు గత ప్రభుత్వం మన ఊరు– మనబడి పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా 2022లో ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధికి నిధులు మంజూరు చేసింది. జిల్లాలో మొదటి విడత కింద రూ.75 కోట్లతో 251 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఇప్పటివరకు కేవలం 78 స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మరో 173 పాఠశాలల్లో ఇప్పటికీ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మరోవైపు పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లులు కూడా విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో పాఠశాల బిల్లులు విడుదల చేయడం లేదని తాళం వేయడం చర్చనీయాంశంగా మారింది.

'అమ్మ ఆదర్శ కమిటీ'లకు అభివృద్ధి బాధ్యతలు

రాష్ట్రంలో నూతనంగా అధికారంలోని వచ్చిన కాంగ్రెస్ సర్కారు ఎస్‌ఎంసీల స్థానంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను నియమించి బడుల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు రూ.23.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల్లో మహిళా సంఘాల సభ్యులు ఇప్పటికే విద్యుత్, తాగునీటి, మరుగుదొడ్లకు మరమ్మతులు వంటి పనులు చేపట్టారు. అయితే అత్యవసర మెయింటనెన్స్‌లో భాగంగా చేపట్టిన పనులు మే 20 లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్ దోత్రే ఆదేశించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల హడావుడి కనిపిస్తోంది. ఈ తరుణంలో 'మన ఊరు– మన బడి' పనులే అసంపూర్తిగా ఉండగా.. మళ్లీ ఇప్పుడు చేపడుతున్న పనులు సకాలంలో పూర్తి కావడం అనుమానంగా మారింది.

ముందుకు సాగని పనులు..

జిల్లాలో మన ఊరు– మన బడి పథకం కింద 78 పాఠశాలల్లో రూ.24 కోట్లతో పనులు పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నారు. రూ.24 కోట్ల ఎంబీ రికార్డు అయితే ఇందులో రూ.5కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. పని చేసిన వాటికి బిల్లులు రాకపోవడంతో చాలా మంది కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేశారు. ఎంపిక చేసిన 251 స్కూళ్లలో సగం చోట్ల కూడా పనులు పూర్తి కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మేజర్ మరమ్మతులైన విద్యుత్, ఫర్నిచర్, బెంచీలు, కుర్చీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు, కెమెరాల ఏర్పాటు వంటి పనులు పూర్తయ్యాయి. ఇక ఉపాధిహామీ పథకం నిధులో నిర్మించే కిచెన్ షెడ్లు, ప్రహరీ, మరుగుదొడ్లు, గ్రంథాలయ రూం తదితర పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పనులు ప్రారంభించిన గుత్తేదార్లు కూడా నిధులు రాకపోవడంతో ముందుకు రావడం లేదు.

త్వరలోనే బిల్లులు



మన ఊరు– మన బడి పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు కొంత ఆలస్యమవుతున్నాయి. ఇప్పటివరకు పూర్తయిన పనులకు సంబంధించి రూ.24 కోట్ల ఎంబీ రికార్డు పూర్తయింది. బిల్లులు ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది.

– అశోక్, డీఈవో

ఎండ.. వాన

కౌటాల(సిర్పూర్): జిల్లాలో ఆదివారం ఎండ దంచికొట్టింది. కాగజ్‌నగర్ మండలం జంబుగాలో అత్యధికంగా 44.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఏజెన్సీ మండలం లింగాపూర్ మినహా అన్ని మండలాలు అలర్ట్ జోన్‌లో ఉన్నాయి. ధనోరాలో 43.4 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదు కాగా.. కౌటాలలో 43.4 డిగ్రీలు, కాగజ్‌నగర్ 43.3, ఎల్కపల్లి 43.2, ఆసిఫాబాద్ 43.0, వాంకిడి 43.0, వంకులం 42.6, లోనవెల్లి 42.4, కుంచవెల్లిలో 42.4 డిగ్రీలుగా నమోదైంది. ఇప్పటికే వడదెబ్బతో జిల్లాలో ముగ్గురు మృత్యువాత పడిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు. మరోవైపు ఆదివారం సాయంత్రం వాంకిడి, కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లో ఈదురు గాలులతోపాటు చిరుజల్లులు కురిశాయి. ఉక్కపోత నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

బీజేపీ పథకాలపై ప్రచారం చేయాలి

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్



మాట్లాడుతున్న గోడం నగేశ్

ఆసిఫాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలపై గ్రామాల్లో ప్రచారం చేయాలని ఆ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలు నిబద్ధతతో పని చేస్తున్న నరేంద్ర మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. పోలింగ్ సమీపిస్తున్నందున పార్టీ నాయకులు ప్రణాళికతో ముందుకెళ్తూ క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రధాని మోదీ చేపట్టిన అభివృద్ధితో దేశం ముందుకెళ్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.కోట్ల నిధులతో మంచిర్యాల నుంచి వాంకిడి వరకు ఫోర్‌లేన్ హైవే నిర్మించడంతోపాటు రూర్బన్ పథకం కింద జిల్లాలో అభివృద్ధి పనులు చేపట్టిందని వివరించారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీజేపీ మచ్చలేని పార్టీ అన్నారు. బీఆర్‌ఎస్‌లో కేసీఆర్ కుటుంబ పాలన సాగుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, నాయకులు ప్రసాద్‌గౌడ్, సురేశ్, మెస్రం తుకారాం, కుమ్రం శంభు, ఈదులవాడ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



దహెగాంలో కవాతు చేస్తున్న పోలీసులు

దహెగాం/పెంచికల్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. దహెగాం మండల కేంద్రంలోని ప్రధాన వీధులతోపాటు పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన చౌరస్తా వరకు ఆదివారం సీఆర్పీఎఫ్ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించామన్నారు. చట్ట విరుద్ధంగా ప్రవర్తించినా.. గొడవలు సృష్టించాలని ప్రయత్నించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, ఎస్సైలు రాజు, కొమురయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా శోభాయాత్ర





ఆసిఫాబాద్‌అర్బన్: కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా సాగింది. అర్చకులు శిరీష్‌శర్మ ప్రత్యేక పూజలు చేయగా.. డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు శోభాయాత్రను ప్రారంభించారు. పొట్టి శ్రీరాములుచౌక్, బ్రాహ్మణవాడ, రావులవాడ, గాంధీచౌక్, వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్‌ల మీదుగా ఆలయం వరకు ఈ యాత్ర సాగింది. ఎమ్మెల్యే కోవ లక్ష్మి పూజలు చేశారు. ఎంపీపీ మల్లికార్జున్, బాలేశ్వర్‌గౌడ్, చిలువేరు వెంకన్న, ఖాండ్రె విశాల్, ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుండా వెంకన్న, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



నేడు ఆదిలాబాద్‌కు సీఎం రాక

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ నామినేషన్‌కు హాజరు
- ప్రభుత్వ డైట్ కళాశాలలో బహిరంగ సభ



డైట్ కళాశాల మైదానంలో సభా వేదిక

కైలాస్‌నగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి రానున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి హాజరవుతున్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులతో పాటు జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉదయం 9.45 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11గంటలకు ఆదిలాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా ప్రభుత్వ డైట్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. పలువురు మంత్రులతో పాటు పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నాయకులంతా హాజరు కానున్న క్రమంలో భారీ వేదికను సిద్ధం చేస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు పోలీసులు పట్టణంలోని పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సభకు హాజరయ్యే ముఖ్య నాయకులతో పాటు ప్రజలను తీసుకువచ్చిన వాహనాలను పార్కింగ్ చేసేందుకు ఇప్పటికే ప్రత్యేక స్థలాలను గుర్తించారు. సభ ఏర్పాట్లను కాంగ్రెస్ నాయకులు ఆదివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. పోలీసులు ఇప్పటికే సభా ప్రాంగణాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నారు.

'ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తాం'



ప్రచారం చేస్తున్న ఆత్రం సక్కు, దండె విఠల్

బెజ్జూర్(సిర్పూర్): పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని వారసంతలో ఆదివారం వారు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆత్రం సక్కు మాట్లాడుతూ గిరిజన కుటుంబం నుంచి వచ్చిన తనను ఆశీర్వదించాలన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో బేరీజు వేసుకోవాలని కోరారు. ఇప్పటికీ రైతుబంధు అందడం లేదని, రైతులకు రుణమాఫీ లేదని.. ఇలా కాంగ్రెస్ అన్నీ అబద్ధపు హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. అనంతరం ఎమ్మెల్సీ విఠల్ మాట్లాడుతూ ఉద్యమ నేపథ్యంతో పుట్టిన బీఆర్‌ఎస్ పార్టీకి కష్టసుఖాలన్నీ తెలుసన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సమయానికి రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ తదితర పథకాలు అందేవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సోయం చిన్నయ్య, సామల రాజన్న, ఉమామహేశ్, రాజేశ్, మల్లన్న, రమేశ్, తిరుపతి, షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.



జనరల్ నుంచి రిజర్వ్‌డ్

- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్వరూపం మారిందిలా..
- హైదరాబాద్ రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలంగాణ వరకు
- జనరల్ స్థానంగా 15 సార్లు ఎన్నికలు
- 2009 నుంచి ఎస్టీ రిజర్వ్‌డ్‌గా మార్పు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రత్యేకతను కలిగి ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు ముందుగానే ఆవిర్భవించిన ఈ నియోజకవర్గం ప్రస్తుతం రాష్ట్రంలో తొలి నియోజకవర్గంగా గుర్తింపుగానూ కలిగి ఉంది. హైదరాబాద్ రాష్ట్రం మొదలు 2019 వరకు ఒక ఉప ఎన్నికతోపాటు 17 సార్లు సాధారణ ఎన్నికలు జరిగాయి. జనరల్‌గా ప్రారంభమైన ఈ స్థానం ప్రస్తుతం ఎస్టీ రిజర్వుడ్‌గా కొనసాగుతోంది. జిల్లాల పునర్విభజన వరకు ఉమ్మడి ఆదిలాబాద్‌లోనే ఉండగా ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలోకి మారింది.

2009లో ఎస్టీ రిజర్వ్‌డ్‌గా రూపాంతరం

జనరల్ స్థానంగా 14 సాధారణ ఎన్నికలతో పాటు ఒక ఉప ఎన్నిక జరిగిన ఈ నియోజకవర్గం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఆ ఏడాది జరిగిన తొలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన రాథోడ్ రమేశ్ కాంగ్రెస్ అభ్యర్థి కోట్నాక్ రమేశ్‌పై 1,15,087 ఓట్ల అధిక్యంతో విజయం సాధించి తొలిసారిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రెండు సార్లు ఎన్నికలు జరిగాయి. 2014లో బీఆర్‌ఎస్ అభ్యర్థి గోడం నగేశ్ విజయం సాధించగా 2019లో సోయం బాపూరావు బీజేపీ తరఫున ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో గోడం నగేశ్ బీజేపీ తరఫున మరోసారి ఎన్నికల బరిలో నిలువగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తరఫున కొత్త అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.

మూడు జిల్లాల పరిధిలో నియోజకవర్గం

2016లో జిల్లాల పునర్విభజనతో పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలను ఎదుర్కొవడం రాజకీయ పార్టీలకు సవాలుగా మారింది. అప్పటి వరకు ఉన్న పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మారనప్పటికీ అవి కొత్తగా ఏర్పడ్డ జిల్లాలతో మూడు జిల్లాల పరిధిలోకి మారాయి. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలు ఆదిలాబాద్ జిల్లా పరిధిలో, ఆసిఫాబాద్, సిర్పూర్.. కుమురంభీం జిల్లాలోకి వెళ్లాయి. ఇక నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజకవర్గాలు నిర్మల్ జిల్లా పరిధిలో ఉన్నాయి.

ఎన్నికల నిర్వహణ సవాలే..

ఈ స్థానానికి సంబంధించి ఎన్నికలు అటు రాజకీయ పార్టీలతో పాటు ఇటు అధికారులకు సవాలుగానే మారింది. బాధ్యతలు సమన్వయం చేసుకోవడం రాజకీయ పార్టీల నేతలకు పెద్ద టాస్కే. అయితే అధికార పార్టీకి కొంత అడ్వంటేజ్‌గా ఉంటుండగా ప్రతిపక్ష పార్టీలకు ఆయా జిల్లాలోని శ్రేణులను సమన్వయం చేసుకోవడం, సభలు, సమావేశాలు, ప్రచార నిర్వహణ కొంత ఇబ్బందికరమే. ఇక యంత్రాంగం పరంగా చూస్తే మూడు జిల్లాల కలెక్టర్లు ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఆయా జిల్లాల ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ వరకు అధికారులను సమన్వయం చేసుకోవాల్సిందే.

స్వరూపం మారిందిలా...

1952లో ఆవిర్భవించిన ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, సిర్పూర్, మంచిర్యాల నియోజకవర్గాలు ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత 1957లో జరిగిన రెండో ఎన్నికలతో పార్లమెంట్ నియోజకవర్గ స్వరూపం తొలిసారిగా కొంత మారింది. ఆ ఐదు నియోజకవర్గాలకు అదనంగా మరో రెండు నిర్మల్, ముథోల్ చేరాయి.
- 1962లో జరిగిన ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం కొత్తగా చేరింది.
- 1978లో నూతనంగా ఏర్పడ్డ ఖానాపూర్‌ను ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కలుపగా అప్పటి వరకు దీని పరిధిలో ఉన్న మంచిర్యాలను పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో విలీనం చేశారు.
- అప్పటి నుంచి జిల్లాల పునర్విభజన వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలతో కూడిన పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికలు జరుగుతూ వచ్చాయి.

క్లుప్తంగా

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


జుమ్మిడి కిరణ్(ఫైల్)

దహెగాం(సిర్పూర్): కడుపు నొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన దహెగాం మండలం పెసరికుంట గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పెసరికుంట గ్రామానికి చెందిన జుమ్మిడి కిరణ్(27) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి తీవ్రతరం కావడంతో శనివారం ఉదయం బహిర్భూమి కోసం స్థానిక వాగు వద్దకు వెళ్లి వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగాడు. అటువైపు వెళ్లిన వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే కిరణ్‌ను మొదట కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆదివారం ఉదయం మంచిర్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

రామకృష్ణాపూర్: పట్టణంలో కుక్కల స్వైర విహారం చేస్తున్నాయి. నిత్యం ప్రజలపై దాడి చేస్తున్నాయి. దీంతో బయటకు రావడానికి కూడా ప్రజలు జంకుతున్నారు. తాజాగా ఆదివారం తెల్లవారుజామున రామాలయం చౌరస్తాలో కుమ్మం సురేందర్‌తోపాటు మరో వ్యక్తిపై దాడిచేసి గాయపర్చాయి. స్థానికులు కుక్కలను బెదిరించి తీవ్రంగా గాయపడిన సురేందర్‌ను ఆస్పత్రికి తరలించారు. ఆయన కుడికాలుకు నాలుగు కుట్లుపడ్డాయి. కుక్కల బెడద ఉన్నా మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పట్టణ వాసులు ఆరోపిస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


గాయపడిన ఆటో డ్రైవర్

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై కల్వరి మినిస్ట్రీ వద్ద ఆగి ఉన్న ఆటోను ఆర్టీసీ బస్సు ఆదివారం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు కాగా, డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. సోమగూడెం నుంచి బెల్లంపల్లి వైపు వెళ్తున్న ఆటో ప్రయాణికులను దించి నిలిపి ఉన్న సమయంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులు ఉండి ఉంటే ప్రాణ నష్టం జరిగేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

చెన్నూర్: పట్టణ సమీపంలోని అస్నాద ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు మైనింగ్ సూపర్‌వైజర్ కిరణ్‌కుమార్ తెలిపారు. కోటపల్లి మండలం నుంచి చెన్నూర్‌కు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

కేటగిరీ ప్రమోషన్లకు బ్రేక్!

- ఎన్నికల కోడ్‌తో నిలిపివేత
- కార్మికుల్లో ఆందోళన
- ఎన్నికల అధికారిని కలిసిన గుర్తింపు సంఘం నాయకులు


ఎన్నికల ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ప్రతీ మార్చిలో ఇచ్చే కేటగిరీ ప్రమోషన్లు ఈసారి నిలిచిపోయాయి. దీంతో ప్రమోషన్లు పొందే కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటా జనవరి నుంచి డిసెంబర్ వరకు ఇతర కేటగిరీల్లో యాక్టింగ్ చేసిన కార్మికులకు ఖాళీల ఆధారంగా ప్రమోషన్లు ఇస్తారు. సంవత్సరంలో కనీసం 150 యాక్టింగ్ మస్టర్లు చేసి ఉంటే ఆయా కేటగిరిల్లో ఖాళీల ఆధారంగా జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు చివరి మూడు సంవత్సరాల యాక్టింగ్‌లను పరిగణలోకి తీసుకుని ప్యానల్ లిస్టు తయారు చేసి ఈ కేటగిరీ ప్రమోషన్లు అందిస్తారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకైతే కనీసం 75 యాక్టింగ్ మస్టర్లు ఉంటే చాలు. ఐతే ఈసారి ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం ఈ ప్రమోషన్లు నిలిపివేసింది. కంపెనీ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది.

ఎన్నికలకు ముందే జాబితా..

ఇదిలా ఉంటే ఎన్నికల కోడ్‌కు ముందే ప్రమోషన్ల లిస్టును అధికారులు తయారు చేశారు. ఏరియాల జీఎంల కార్యాలయాల నుంచి అన్ని గనులు, డిపార్టుమెంట్లకు ఈ లెటర్లు సైతం బట్వాడా అయ్యాయి. కానీ వీటిని పంపిణీ చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో యాజమాన్యం వీటి పంపిణీ నిలిపివేసింది. దీంతో కంపెనీ వ్యాప్తంగా సుమారు 600 మంది ఈ ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారు.

గతంలో ఇలాంటిది లేదు..

ఇదిలా ఉంటే సింగరేణిలో ఏటా కేటగిరీ ప్రమోషన్లు ఇవ్వడం జరుగుతుందని, గతంలో ఎప్పుడు కూడా ఎన్నికల కోడ్ పేరుతో యాజమాన్యం వీటిని ఆపలేదని కార్మిక సంఘం నాయకులు పేర్కొంటున్నారు. సింగరేణి ఓ ప్రభుత్వరంగ సంస్థ, ఈ ప్రమోషన్లు కొత్తగా వచ్చిన హక్కు కాదని, ఎన్నో ఏళ్లుగా ఉన్న వాటిని యాజమాన్యం కోడ్‌తో ముడిపెట్టి ఆపడం సరికాదంటున్నారు. ఎన్నికల కోడ్ ఉన్నా కూడా ఈప్రమోషన్ పత్రాలను మ్యాన్‌వేలపై కార్మికుల చేతికి అధికారులు అందించినా ఎలాంటి ఇబ్బంది ఉండదని పేర్కొంటున్నారు. గనులపై కార్యక్రమాలు చేపట్టి ట్రేడ్‌యూనియన్, రాజకీయ పార్టీల నేతలు పిలిచి లెటర్లు ఇస్తేనే కోడ్ కిందికి వస్తుందని అభిప్రాయ పడుతున్నారు.

ఎన్నికల అధికారికి వినతి..

కేటగిరీ ప్రమోషన్లు నిలిపివేయంపై ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను హైదరాబాద్‌లోని ఎన్నికల కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణిలో ఈ ప్రమోషన్లు రొటీన్‌గా జరుగుతాయని, ఎన్నికల కోడ్‌కు దీనికి సంబంధం లేదని తెలిపారు. గతంలో ఏ ఎన్నిక సందర్భంగా ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేదని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజీకుమార్ రాష్ట్ర ఎన్నికల అధికారికి తెలిపారు. రెగ్యులర్‌గా ఇచ్చే ప్రమోషన్లను ఎన్నికల కోడ్‌తో ముడిపెట్టి యాజమాన్యం పంపిణీ ఆపేసిందని తెలిపారు. దీనిపై యాజమాన్యంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

ఆదాయ పన్ను యాజమాన్యమే చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

- ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య
- నాయకులకు శిక్షణ తరగతులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు పెర్క్స్‌పై ఆదాయపన్ను యాజమాన్యమే చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య డిమాండ్ చేశారు. నస్పూర్ కాలనీలోని సింగరేణి గార్డెన్‌లో యూనియన్ నాయకులుకు ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. సీతారామయ్య మాట్లాడుతూ కోలిండియాలో ఉద్యోగులకు, సింగరేణిలో అధికారులకు సైతం పెర్క్స్‌పై ఆదాయ పన్నును యాజమాన్యమే చెల్లిస్తుందన్నారు. సింగరేణిలో కార్మికులు కూడా కంపెనీనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం గనులపైకి వచ్చే పార్టీల నాయకులు ఈ రెండు ప్రధాన హామీలను నెరవేరుస్తామని హామీ ఇస్తేనే ఓట్లేస్తామని కార్మికులు తేల్చి చెప్పాలన్నారు. అప్పుడే వీటిని సాధించుకుంటామన్నారు. ఎంపీ ఎన్నికల విధులు నిర్వహించే సింగరేణి ఉద్యోగులకు ఎన్నికల విధుల రోజులను కంపెనీ స్పెషల్ లీవ్‌గా ఇస్తుందని, దీనివల్ల ఉద్యోగులు నష్టపోతారని పేర్కొన్నారు. ఎన్నికల విధులకు హాజరైన వారికి ఓడీగా పరిగణించాలని డిమాండ్ చేశారు. కంపెనీ గత సంవత్సరం 70 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తిని సాధించి రికార్డు నెలకొల్పిందన్నారు. దీనికి కారణమైన ఉద్యోగులకు వెండి లేదా బంగారు నాణెం కానుకగా ఇవ్వాలని కోరారు. దీంతో కార్మికులు ఉత్సాహంగా పనిచేసి 72 మిలయన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని కూడా అవలీలగా సాధిస్తారని తెలిపారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్ మాట్లాడుతూ చాలా గనుల్లో కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను నడిపిస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వాటిస్థానంలో కొత్త యంత్రాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఐదు నెలలు గడిచినా ఇప్పటికీ తమకు గుర్తింపు పత్రం ఇవ్వలేదని తెలిపారు. మార్చిలో ఇచ్చే కేటగిరీ ప్రమోషన్లను ఎన్నికల కోడ్ పేరుతో నిలిపివేశారన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.యూసఫ్, ప్రొఫెసర్ నర్సింహారావు, సింగరేణి రిటైర్డ్ డీజీఎం శ్యాంసుందర్‌రెడ్డి, శ్రీరాంపూర్ ఏరియా డీవైసీఎంవో రమేశ్‌బాబు కార్మిక ఉద్యమం, నాయకత్వ లక్షణాలు, కార్మిక చట్టాలు, లేబర్ కోడ్స్, లౌకికవాదం, రిటైర్డ్ కార్మికులకు రావలసిన బెనిఫిట్స్, మైన్స్ రూల్స్, వృత్తి పరమైన ఆరోగ్య సమస్యలు తదితర అంశాలపై శిక్షణ అందించారు. యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

పటిష్టంగా ప్రజా సంఘాల నిర్మాణం

- సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్‌రావు


మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రావు

పాతమంచిర్యాల: ప్రజా సంఘాలను పటిష్టంగా నిర్మించుకోవాలని, పార్టీ నిర్మాణ వ్యతిరేకులను, విచ్ఛిన్నకారులను తిరస్కరిద్దామని సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాదినేని వెంకటేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కొందరు వ్యక్తిగతంగా పోటీ కమిటీల నియామకాలు చేస్తున్నారని అన్నారు. ఈ కమిటీల నిర్మాణం పార్టీ నిర్మాణ పద్ధతులకు వ్యతిరేకమని తెలిపారు. ఆ కమిటీలు చెల్లవని స్పష్టం చేశారు. పోటీ కమిటీలో ఉన్న వ్యక్తులను సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నిర్మాణంలో ఉన్న అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన గోపీనాథ్, కాంతారావును పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. వారు ఐఎఫ్‌టీయూ నియమాలకు, నిర్మాణ పద్ధతులకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు మేకల రామన్న, ఎదునూరి రమేశ్, దేవయ్య, సారయ్య, ఖలీల్, రాజేశ్వర్‌రావు, సురేందర్, ఎండీ.షాహీద్, ప్రభంజన్ పాల్గొన్నారు.

‘మిసెస్ వరల్డ్’కు డాక్టర్ చంద్రిక



డాక్టర్ చంద్రిక

నిర్మల్: మిసెస్ వరల్డ్–ఇంటర్నేషనల్ ఫైనల్ పోటీలకు జిల్లాకేంద్రానికి చెందిన వైద్యురాలు చంద్రిక ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో శనివారం నిర్వహించిన ఆడిషన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఇందులో సెల్ఫ్ ప్రజెంటేషన్, ఇంట్రడక్షన్, ఇంటర్వ్యూ తదితర రౌండ్లలో ప్రతిభ కనబర్చారు. ఈమేరకు హైదరాబాద్ నుంచి చేపట్టిన ఆడిషన్స్‌లో ఆమె ఫైనల్‌కు ఎంపికయ్యారు. గురుగ్రామ్‌లో జూన్ ఒకటిన ఫైనల్ పోటీలుంటాయని చంద్రిక తెలిపారు. నిర్మల్ నుంచి తాను ఇక్కడిదాకా రావడానికి తన భర్త డాక్టర్ అవినాష్, అత్తమ్మ దేవీబాయి సహకారమే కారణమని పేర్కొన్నారు.

బెంగళూరు వెళ్లిన తలసేమియా పిల్లలు


మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న తలసేమియా పిల్లలు, వారి తల్లిదండ్రులు

మంచిర్యాలటౌన్:తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలు మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ బెంగళూరు వారి సహకారంతో భగవాన్ మహవీర్ జైన్ హాస్పిటల్‌కు ఆదివారం వెళ్లారు. బోన్ మారో మార్పిడి నిమిత్తం ముందస్తు వైద్య పరీక్షల కోసం ఆరుగురు పిల్లలతోపాటు వారి తల్లిదండ్రులను మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి రైలులో బెంగళూరుకు పంపినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ కంకణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల హెచ్‌ఎల్‌ఏ క్యాంపు నిర్వహించగా, రిపోర్టులో 9 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులకు, వారి కుటుంబ సభ్యులతో రిపోర్టులు సరిపోలడంతో బెంగళూరు ఆసుపత్రికి పంపించామని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బోన్ మారో మార్పిడి చేయించడం జరుగుతుందని వెల్లడించారు. బోన్ మారో మార్పిడితో తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధులు పూర్తిగా నయమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రధాన కార్యదర్శి చందూరి మహేందర్, జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ, ముల్కల్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీఎస్‌ఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష

- ఉమ్మడి జిల్లాలో 4,437 మంది హాజరు


పరిశీలిస్తున్న ఆర్‌సీవో గంగాశంకర్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల(టీఎస్‌ఆర్‌జేసీ)ల్లో 2024–25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్షకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 5,506 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని 23 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,437 మంది హాజరయ్యారు. 1,069 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను టీఎస్‌ఆర్ జేసీ రీజినల్ కో ఆర్డినేటర్ గంగాశంకర్ పరిశీలించారు. ఇందులో ప్రతిభ ఆధారంగా విద్యార్థులకు ఉమ్మడి జిల్లాలోని రెండు టీఎస్‌ఆర్ జేసీ కళాశాలల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బాలికల కళాశాలలో 88 సీట్లు, బెల్లంపల్లిలోని బాలుర కళాశాలలో 88 సీట్లు ఉన్నట్లుగా ఆర్‌సీవో వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మంచిర్యాలక్రైం:జిల్లా కేంద్రంలోని లక్ష్మీ టాకీస్ చౌరస్తాలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. లక్సెట్టిపేట మండలం వెంకట్రావ్‌పేట గ్రామానికి చెందిన బత్తుల సత్తయ్య (50) పాల వ్యాపారం చేస్తున్నాడు. రోజూ లాగానే పాలు విక్రయించేందుకు మంచిర్యాలకు వచ్చాడు. లక్ష్మీ టాకీస్ వద్ద ఓ హోటల్‌లో పాలు పోసి రోడ్డు దాటుతుండగా అతి వేగంగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్తయ్య చికిత్స పొందుతున్నాడని ఎస్సై తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గాలివానకు తీవ్ర నష్టం


ధ్వంసమైన నవేగూడ పాఠశాల డైనింగ్ హాల్

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. నవేగూడ, చించోలీ, ఎనోలీ, కొలాంగూడతోపాటు పలు గ్రామాల్లో ఈదురు గాలులకు తీవ్ర నష్టం వాటిల్లింది. నవేగూడలో గుర్నులే ఉద్ధుడుకు చెందిన ఇంటి పైకప్పు ఎగిరిపోయింది. స్థానిక ప్రభుత్వ పాఠశాల డైనింగ్ హాల్ పూర్తిగా ధ్వంసమైంది. మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చించోలీలో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడగా పాటగూడ పంచాయతీ పరిధిలోని ఎనోలీ కొలాంగూడలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన నివాస గృహాలు ఈదురు గాలులకు దెబ్బతిన్నాయి. నాసిరకంగా ఏర్పాటు చేసిన రేకులు గాలి ధాటికి ఎగిరిపోయాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.


కూలిన ఇల్లు


ఒరిగిన విద్యుత్ స్తంభం

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

- టాటా ఏస్, బొలెరో వాహనాలు ఎదురెదురుగా ఢీ
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా..
- ఆదిలాబాద్ జిల్లా సుంకిడి వద్ద ఘటన


బోల్తా పడిన వాహనాలు

తలమడుగు: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలైన ఘటన తలమడుగు మండలం సుంకిడి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా సోమతానా గ్రామానికి చెందిన 16 మంది శనివారం ఉదయం టాటా ఏస్‌లో చంద్రాపూర్ జిల్లా మహంకాళి ఆలయ దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి రాత్రి స్వగ్రామానికి పయనమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున తలమడుగు మండలం సుంకిడి గ్రామ సమీపంలో గల పెట్రోల్ పంపు వద్ద ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. టాటా ఏస్ డ్రైవర్ గాదె పాండురంగ్ అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలవగా.. మిగతావారు స్వల్పంగా గాయపడ్డారు. బొలెరో వాహనం బోల్తా పడగా అందులోని డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం వారంతా చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

దుబాయ్‌లో మనోళ్లు భద్రమేనా!


దుబాయ్‌లో నీటమునిగిన తెలుగువారు ఉండే ఓ ప్రాంతం

- భారీవర్షాలతో గల్ఫ్‌దేశం అతలాకుతలం
- ఆందోళనలో గల్ఫ్ కార్మిక కుటుంబాలు
- సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న బాధితులు
- లైఫ్‌గార్డ్ బృందంలో నిర్మల్‌వాసి సందీప్



వరదనీటిలో చిక్కుకున్నవారిని బయటకు తెస్తున్న బృందంలో సందీప్

నిర్మల్‌ఖిల్లా: గల్ఫ్ దేశమైన దుబాయ్‌లోని పలు ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భారీవర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని భారీ వర్షాలతో అక్కడిజనం అతలాకుతలమవుతున్నారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, వీడియోలు వైరల్ అవుతుతున్నాయి. వాటిని చూస్తున్న గల్ఫ్ కార్మికుల కుటుంబీకులు ఆందోళన చెందుతున్నారు. నిర్మల్ జిల్లా నుంచి వేలసంఖ్యలో ఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. దుబాయ్‌లో కుండపోత వర్షాల కారణంగా జనం సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్నట్లు సమాచారం. దుబాయ్‌లోగల లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లు నీటమునిగాయి. దాదాపు ఆరడుగుల లోతున్న వరద నీటిలో ఇరుక్కుపోయిన వారిని పడవలు, బోట్లు, సహాయకబృందాల ద్వారా బయటకు తీసుకువస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ వాసి పాతర్ల సందీప్ ‘సాక్షి’తో ఫోన్‌లో తెలిపారు. దుబాయ్ డీపీ– 1 గ్రీన్ కమ్యూనిటీలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న సందీప్ అక్కడి విపత్తు నిర్వహణాధికారుల ఆదేశాల మేరకు వరద నీటిలో చిక్కుకున్న లోతట్టు ప్రాంతాలవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధుల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. మిగతా ప్రాంతాల్లోని కార్మికులను కూడా బృందాలుగా ఏర్పడిన లైఫ్‌గార్డ్స్ ప్రాణాలకు తెగించి నీటమునిగిన వారిని బయటకు తీస్తున్నట్లు వివరించారు. నాలుగురోజులుగా విపరీతంగా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించినట్లు వివరించారు.

ప్రశంసలు పొందుతున్న జిల్లావాసి..

నిర్మల్ జిల్లాకేంద్రానికి చెందిన పాతర్ల సందీప్ దుబాయ్‌లోని గ్రీన్ కమ్యూనిటీ ప్రాంతంలో లైఫ్‌గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో భాగంగా అక్కడిబృందంలో నిర్వహిస్తున్న విధులకుగాను అధికారులు ఇతడిని ప్రశంసిస్తున్నారు. జిల్లావాసులు కూడా అతడు అందిస్తున్న సేవలు తెలుసుకుని ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

కుశ్నపల్లి ఎల్లమ్మ ఆలయంలో అఘోరా పూజలు


ఎల్లమ్మ తల్లి ఆలయంలో అఘోరా

నెన్నెల:మండలంలోని కుశ్నపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామానికే చెందిన అఘోర హాజరై అమ్మవారికి పూజలు చేశారు. 8 ఏళ్ల క్రితం గ్రామం నుంచి వెళ్లిన ఆయన అఘోరాగా మారి రావడంతో అతనిని చూసేందుకు గ్రామస్తులు అధికంగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తన స్వగ్రామంలో నిర్మించిన ఆలయానికి తన వంతుగా రూ.30 వేలు విరాళంగా అందించారు. కుశ్నపల్లి గ్రామం తాను మొదట హిమాలయాలకు వెళ్లానని, ప్రస్తుతం చెన్నైలో ఉంటున్నానని పేర్కొన్నారు. గ్రామస్తులు అఘోరాకు పూజలు చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంధ్య మహేష్‌రెడ్డి, గుడిసెల నానాగౌడ్, భైరి మల్లాగౌడ్ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

రామకృష్ణాపూర్: పట్టణంలోని బి–జోన్ శాంతినగర్ ప్రాంతానికి చెందిన ఆడెపు అనిత(40) శనివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెంది అనితది నిరుపేద కుటుంబం. కుటుంబం గడవడానికి మహిళా సంఘంలో రుణం తీసుకుంది. ఆర్థిక ఇబ్బందులతో వాటిని తీర్చలేదు. హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి అప్పులు తీరుస్తానని తల్లికి చెప్పి వెళ్లిన కొడుకు చాలా రోజులైనా అప్పులు తీర్చలేదు. మరోవైపు ఇంటికి కూడా రావడం లేదు. శనివారం రాత్రి కొడుకుకు ఫోన్ చేసి ఇంటికి రావాలని కోరినా రాకపోవడంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.